బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

సమావేశంలో మాట్లాడుత్ను సీడీపీవో వెంకటేశ్వరమ్మ

ధారూరు, ఫిబ్రవరి 27: మండలంలో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్ల పై ఉందని వికారాబాద్ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీసీవో వెంకటేశ్వరమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సాధన సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాలకార్మికుల విముక్తి అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన సంస్థ డైరెక్టర్ సీహెచ్ మురళీమోహన్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా పరిధిలో బాల్య వివాహాలు జరగుతున్నాయని, వాటిని అరికట్టవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంద న్నారు. అంతరం తహసీల్దార్ షాజిదా బేగం మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలి కోరారు. కార్యక్రమంలో సాధన సంస్థ మండల కోఆర్డినేటర్ బి.అంజయ్య, సభ్యులు ఎండి, అసిమా, బి.శివలక్ష్మి, ప్రకాశం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు,తదితరులు పాల్గొన్నారు

నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎంతో ఉపయోగం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తేజ

పరిగి, ఫిబ్రవరి 27: నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పీఎంకేకే పరిగి కేంద్రం మేనేజర్ వినయ్, పల్లవి కళాశాల ప్రిన్సిపాల్ తేజ పేర్కొన్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న కౌశల్ సంగమ్‌పై గురువారం పరిగిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పిస్తుం దన్నారు. ఈ కార్యక్రమంతో యువతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. నిపుణులైన వారిచే శిక్షణతో వృత్తిపరమైన మార్గదర్శనం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులకు భవిష్యత్తులో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండ్లి పేరుతో మోసం..

బెయిల్‌పై వచ్చి యువతిపై దాడి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 27: పెండ్లి విషయం మాట్లాడుకునేందుకు పిలిపించిన ఓ యువతిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని సింగాడబస్తీలో నివాసం ఉంటున్న యువతి(21) అదే ప్రాంతంలో అర్షద్ అనే వ్యక్తితో మూడేళ్లుగా ప్రేమలో ఉన్నది. అయితే ఆమెను పెండ్లి చేసుకుంటానంటూ నమ్మించి శారీరకంగా వాడుకుని ముఖం చాటేయడంతో నెలరోజుల కిందట బాధిత యువతి అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు అర్షద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల బెయిల్ మీద బయటకు వచ్చిన అర్షద్ కుటుంబసభ్యులు బాధిత యువతి ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని మర్చిపోయి రాజీ కుదుర్చుకుందామని ప్రతిపాదించారు. నిందితుడు అర్షద్, బాధిత యువతి కలిసి ఒక సారి మాట్లాడుకుని ఏం చేద్దామనే విషయంపై నిర్ణయించుకోవాలని ఇరువర్గాల కుటుంబసభ్యులు అంగీకరించారు. ఈ క్రమంలో ఈనెల 25వ తేదీన బంజారాహిల్స్ రోడ్ నం.1లోని వెంగళరావు పార్కులో అర్షద్‌తో యువతి కలిసి మాట్లాడుతున్న సమయంలో అక్కడికి వచ్చిన అర్షద్ సోదరుడు, అర్షద్ మామ పార్కులోకి వచ్చి ఆమెపై దాడి చేశారు. అర్షద్‌ను వదిలిపెట్టక పోతే అంతుచూస్తామని హెచ్చరించారు. ఆమెను దుర్భాషలాడటంతో పాటు బెదిరింపులకు గురిచేశారు. ఈ మేరకు బాధిత యువతి గురువారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నిందితులు ముగ్గురిపై బీఎన్ఎస్ 74, 115(2), 351(2)(3)రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిమ్స్ బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఆత్మహత్య

ఖైరతాబాద్, ఫిబ్రవరి 27 : నిమ్స్ బయో కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్(62) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూరారం వద్ద గల కట్ట మైసమ్మ చెరువులో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు అది డాక్టర్ విజయ భాస్కర్ దిగా తేల్చారు. 2017 నుంచి నిమ్స్ బయో కెమిస్ట్రీ విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. గత కొద్ది రోజులుగా అయన విధులకు హాజరు కావడం లేదు. డాక్టర్ విజయ భాస్కర్ మృతి పట్ల నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సమస్యలను జయించడమే జీవితం

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

యాలాల, ఫిబ్రవరి 27: మనుష్యులందరికీ ఏదో ఒక స్థాయిలో వచ్చే సమస్యలను తట్టుకొని నిలబడడమే జీవితమని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌హెచ్ఓ గిరితో కలిసి పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్షణికావేశంలో మానసికస్థైర్యం కోల్పోయి ఆవేశపూరిత నిర్ణయాలతో ఆత్మహత్యలకు పాల్పడడం చాలా పెద్దతప్పన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలు సాకారం చేయడంలో ఎక్కడ విఫలమౌతామోననే దోరణిలో ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పరీక్షల ఒత్తిడి వల్ల, పరీక్షల ఫలితాల సమయంలో ప్రేమ పేరుతో విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆకతాయిల వేధింపులపై ఫిర్యాధు చేయడానికి పాఠశాల, కళాశాలల్లో ప్రతి క్లాస్ రూంలలో క్యూఆర్ కోడ్ అంటించే కార్యక్రమం చేపట్టామన్నారు. వేధింపులకు గురైన విద్యార్థినులు ఫిర్యాదు చేసేందుకు సులువైన మార్గాలు ఉన్నాయన్నారు. సమస్య తలెత్తితే వెంటనే డయల్ 100, షీ టీం వాట్సప్ నెంబర్ 833ఐ986926కు ఫిర్యాదు చేయాలన్నారు.

తల్లీకొడుకు మృతి ఘటనలో

ఓ వ్యక్తి రిమాండ్

బషీరాబాద్, ఫిబ్రవరి 27 : అనుమానాస్పద స్థితిలో తల్లీకొడుకు మృతి చెందిన సంఘటనలో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు బషీరాబాద్ ఎస్సై శంకర్ గురువారం తెలిపారు. కాశీంపూర్ గ్రామంలో ఎల్లమ్మ, మొగులప్ప తల్లీకొడుకులు మంగళవారం ఒకే రోజు ఇంట్లో దూలాలకు ఉరేసుకున్న స్థితిలో మృతి చెందడం కలకలం రేపిన విషయం తెలిసిందే. విషయాన్ని బషీరాబాద్ పోలీసులు సీరియస్‌గా తీసుకుని 48 గంటల్లో ఛేదించారు. ఎల్లమ్మ, మొగులప్ప మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి సోదరి నర్సమ్మ మరదలు రేణుకపై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. దీంతో పోలుసులు పలు కోణాల్లో విచారణ చేపట్టారు. అందులో భాగంగానే కొంత మంది గ్రామస్తులను, మొగులప్ప భార్య రేణుకను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. అన్ని కోణాల్లో విచారించిన పోలీసులు భార్య రేణుక పెట్టిన టార్చర్‌తోనే అత్త ఎల్లమ్మ, భర్త మొగులప్ప ఊరేసుకుని మృతి చెందినట్లు ఎస్సై శంకర్ పేర్కొన్నారు.

టెలికాం అడ్వయిజరీ బోర్డు సభ్యుడిగా పెంటయ్యగుప్తా

పరిగి, ఫిబ్రవరి 27: టెలికాం అడ్వయిజరీ బోర్డు మెంబర్‌గా పరిగికి చెందిన పెంటయ్యగుప్త నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం జరిగిన అడ్వయిజరీ బోర్డు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తనను టెలికాం అడ్వయిజరీ బోర్డు సభ్యుడిగా నియమించడంలో సహకరించినందుకు పార్ల మెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బైక్‌పై వచ్చి..

సెల్‌ఫోన్ స్నాచింగ్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 27: రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనాసరుల్ రహ్మాన్(45) అనే వ్యక్తి సయ్యద్‌నగర్‌లో నివాసం ఉంటూ ఫిలింనగర్‌లో మగ్గం వర్క్స్ చేస్తుంటాడు. గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో పని ముగించుకుని మరో ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. సయ్యద్ నగర్‌లోని అబ్దుల్లా బేకరీ వద్దకు రాగానే రెండు బైకులపై నలుగురు వ్యక్తులు వారికి ఎదురుగా వచ్చారు. ఓ బైక్‌పై వెనకాల కూర్చున్న గుర్తుతెలియని వ్యక్తి రహ్మాన్ చేతిలోని ఫోన్‌ను లాక్కుని పారిపోయారు. బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాధిత కుటుంబాలకు పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

కులకచర్ల, ఫిబ్రవరి 27: కులకచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామానికి చెందిన అశోక్, హన్మంత్‌లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న 2002లో పుట్టపహాడ్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వారికి తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా గురువారం వారి ఇండ్లకు వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడు అశోక్ భార్య స్వాతికి 20వేలు, హన్మంత్ భార్య జ్యోతికి 32వేలు ఆర్థిక సహాయం అందించారు. తమ స్నేహితుల మృతి తీరని లోటని అన్నారు.

భజన మండలికి 40 జతల గజ్జెలు సాయం

ఆర్మీ సోల్జర్స్‌ను సన్మానిస్తున్న దేవాలయ కమిటీ చైర్మన్ మైపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు

కులకచర్ల, ఫిబ్రవరి 27 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామ పాండురంగని భజన మండలికి 40 జతల గజ్జెలు సాయం చేయాలని ఆర్మీసోల్జర్స్‌ను అడగడంతో అందించినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ మైపాల్‌రెడ్డి, రిటైర్డ్ ఆర్మీ సోల్జర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఇవి అందజేసినట్లు తెలిపారు. సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన ఆర్మీ సోల్జర్స్‌లో గోపాల్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, భరత్‌సింహ్మారెడ్డి, మొగులయ్య, కృష్ణ, అంజి, వెంకటయ్య, రాజు, అంజి, పి వెంకటయ్య, బచ్చయ్య, కృష్ణ, వెంకటేశ్, ఆంజనేయులు, రామకృష్ణ, మదన్‌మోహన్, సీహెచ్ కృష్ణ, మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, రాములు, మల్లేశ్, వెంకటేశ్, గోపాల్, భీంసేన్, శ్రీను, చంద్రారెడ్డి, ఎం కృష్ణ, నవీన్‌కుమార్‌గౌడ్, నర్సింహులు, నవీన్‌కుమార్‌లు ఆర్మీతో పాటు పారామిలటరీ సైనికులు సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

లైఫ్ ఇన్సూరెన్స్ రిఫండ్ పేరిట రూ.5.81 లక్షలు టోకరా

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ): లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇస్తామని చెప్పి సైబర్ నేరగాళ్లు రూ.5.81 లక్షలు కాజేసిన ఘటన సికింద్రాబాద్‌లో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి పలు ఇన్సూరెన్స్ కంపెనీల్లో జీవిత బీమా పాలసీలు తీసుకున్నాడు. ఆయనకు ఐజీఎంఎస్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నామంటూ పలు నంబర్ల నుంచి ఫోన్ చేశారు. బీమా పాలసీలకు సంబంధించిన రీయింబర్స్‌మెంట్ డబ్బు చెల్లిస్తామని నమ్మబలికారు. ఎన్‌పీసీఐ సేవల కింద ముందుగా 5 శాతం డబ్బును చెల్లించాలని, దశలవారీగా బాధితుడి నుంచి రూ.5,81,606 కాజేశారు. ఎంతకూ డబ్బు తిరిగి చెల్లించకపోవడంతో ఫోన్ చేసి వారిని నిలదీశారు. మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల కోడ్ వల్ల తనకు రావాల్సిన డబ్బు ఆలస్యమవుతున్నదని చెప్పారు. ఆ తర్వాత కొద్ది కాలానికి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకొని కేసు దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.70,400 నగదును సీజ్ చేశారు. ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం ప్రకారం... మలక్‌పేట, తాళ్లకట్టకు చెందిన మహ్మద్ ముగ్దమ్ స్థానికంగా గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు గురువారం నిందితుడి ఇంటిపై దాడులు చేశారు. ఈ దాడుల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్ధమ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, అతడి వద్ద నుంచి రూ.70,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మహ్మద్ వాజీద్, ఎండీ జావెద్‌తో పాటు మరో వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కల్‌ఖోడాలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

మర్పల్లి, ఫిబ్రవరి 27: గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధే ధ్యేయమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కల్‌ఖోడా, తొర్మామిడి, కేసారం ఆర్‌అండ్‌బీ రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు అధిక నిధులు కేటాయించి రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి తీసుకున్నట్లు తెలిపారు. రూ.3.49 కోట్ల వ్యయంతో కల్‌ఖోడా, తొర్మామిడి, కేసారంఆర్‌అండ్‌బీ రోడ్లకు శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం మండలంలోని రావులపల్లి గ్రామంలోని పీతంబారేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని సూ చించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రవణ్ ప్రకాశ్, డీఈలు శ్రీధర్‌రెడ్డి, జితేందర్, తహసీల్దార్ మునిరొద్దీన్, ఎంపీడీవో రాజమల్లయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, మండల నాయకులు సురేశ్ యాదవ్, రాములు యాదవ్, రామేశ్వర్, సురేశ్, రాచన్న, పాండు నాయక్, గోపాల్ నాయక్ పాల్గొన్నారు

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, ఫిబ్రవరి 27: గురుకుల పాఠశాల విద్యార్థులు 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని బం డవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలను పరిశీలించిన ఆయన అక్కడ మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడే 10వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులు 10వ తరగతి వార్షిక పరీక్షకు సన్నద్ధమవుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గురుకుల పాఠశాలలోని ప్రతి విద్యార్థి 10లో ఉత్తీర్ణులు కావాలన్నారు. పాఠ్యాంశాలలో ఉన్న ప్రతి అం శాన్ని నేర్చుకొని చక్కగా పరీక్షకు హాజరుకావాలని, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్ష రాయాలని సూచించారు. గురుకుల పాఠశాలలో ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందిం చాలని సూచించారు. అనంతరం వంటగదిని పరిశీలించారు. వంటగదితో పాటు పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ అశోక హోటల్‌కు బాంబు బెదిరింపు కాల్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 27: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న అశోక హోటల్‌కు బాంబు బెదిరింపు కాల్ కలకలం రేపింది. దీంతో ఒక్కసారిగా అటు ప్రయాణికులు, ఇటు స్టేషన్ ముందు వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారులు, యజమానులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన బుధవారం రాత్రి గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. గుర్తు తెలియని ఓ ఆగంతకుడి నుంచి ఫలాన హోటల్‌లో బాంబు పెట్టాం.. అని కంట్రోల్ రూంకు ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే సమాచారం అందుకున్న గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. హోటల్‌లోని సిబ్బందిని, కస్టమర్లను బయటికి పంపించి డాగ్, బాంబ్ స్క్వాడ్‌లతో గంటపాటు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో హోటల్‌లో ఎలాంటి బాంబులేదని నిర్ధారించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గుర్తు తెలియని ఆకతాయి చేసిన పనిగా పోలీసులు తేల్చారు. కంట్రోల్ రూంకు బాంబు బెదిరింపు కాల్ చేసిన వ్యక్తిని త్వరలో పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

మెట్రో పిల్లర్ ను ఢీ కొట్టిన కారు..

ఐదుగురికి తీవ్రగాయాలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 27 : అతివేగంతో మెట్రో పిల్లర్ ను ఢీకొట్టిన కారు నుజ్జునుజ్జ కాగా, ఐదుగురికి తీవ్ర గాయాలైన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం... పటాన్ చెరువు ప్రాంతానికి చెందిన షిఫ్ట్ కారు బుధవారం అర్ధరాత్రి కూకట్పల్లి నుంచి పటాన్ చెరువు వైపునకు వెళుతుండగా.. అతి వేగంతో జాతీయ రహదారిపై కే పి హెచ్ బీ కాలనీలో పిల్లర్ నంబర్ 751 వద్ద మెట్రో పిల్లర్ ను షిఫ్ట్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న ఐదు గురికి తీవ్రగాయాలయ్యాయి. వారు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కాగా, షిఫ్ట్ కారును వెనకాల వచ్చిన క్రెటా కారు ఢీకొట్టగా.. అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సైబర్‌నేరాల్లో మరో ట్రెండ్..

'నెగెటివ్ బ్యాలెన్స్'
ట్రేడింగ్ మోసాలలో సరికొత్త పంథా
పెట్టుబడులు పెట్టి మధ్యలోకి వెళ్లిన తర్వాత నట్టేట ముంచేస్తారు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): 'మీరు ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి ట్రేడింగ్ చేయకపోతే నెగెటివ్‌లోకి వెళ్తారు. మీకు రావాల్సిన లాభాలకు గండి పడుతుంది' అంటూ కొత్త ఎత్తులతో సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్‌నేరాలలో పెట్టుబడులు, ట్రేడింగ్ పేరుతో ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ప్రతి రోజు రెండు కోట్ల వరకు బాధితులు నష్ట పోతున్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం వివిధ రూపాలలో సైబర్‌నేరాలను అడ్డుకోవడం కోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నది. ఈ నేపథ్యంలోనే సైబర్‌నేరగాళ్లు ఎవరికి అందని ఎత్తులతో ముందుకెళ్తున్నారు. బాధితులు ట్రేడింగ్‌లో భారీ లాభాలు సంపాదించవచ్చనే ఆలోచనతో సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వచ్చే ప్రకటనలు, లింక్‌లను చూసి ట్రాప్‌లో పడుతున్నారు. ట్రాప్‌లో పడ్డవారు కొన్నాళ్లపాటు సైబర్‌నేరగాళ్లు చెప్పినట్లు ట్రేడింగ్ చేస్తూ ఉంటారు. ఇందులో భాగంగానే సైబర్‌నేరగాళ్లు సూచించే లింక్‌లను క్లిక్ చేసి ట్రేడింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటారు. ఇలా డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లలో బ్యాకెండ్‌లో సైబర్‌నేరగాళ్లు స్క్రీన్‌పై బాధితుల లాభాలు భారీగా చూపిస్తుంటారు. అయితే అవి డ్రా చేసుకోవడానికి వెళ్లే సరికి డ్రా కాకుండా బ్యాకెండ్ నుంచి నిలుపుదల చేస్తుంటారు. ఇదంతా గత కొన్నేళ్లుగా జరుగుతున్న తంతూ. ఇప్పుడు బాధితులు మొదట కొంత పెట్టుబడి పెట్టడంతో నమ్మకం కోసం తక్కువ మొత్తంలో కొన్ని లాభాలు చూపిస్తుంటారు. నమ్మకం కుదిరిన తరువాత ఎక్కువ మొత్తంలో పెట్టుబడి

పెట్టించి మోసాలకు పాల్పడుతుంటారు. ఇప్పుడు తాజాగా మరో అడుగు ముందుకేసిన సైబర్‌చీటర్స్ నెగెటివ్ బ్యాలెన్స్ పేరుతో కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నారు. ఎక్కువ మొత్తంలో, వేగంగా ట్రేడింగ్ చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయని అలా కాకుండా నెమ్మదిగా ట్రేడింగ్ చేస్తే అకౌంట్లలోని డబ్బంతా నెగెటివ్‌లోకి వెళ్తుందని బాధితులను నిండా ముంచేస్తున్నారు.

నెగెటివ్‌లోకి వెళ్తారని

చైతన్యపురికి చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగిని గ్యాలక్సీ ఎర్నింగ్ 8218 డిస్కషన్ గ్రూప్స్ అనే టెలిగ్రామ్ గ్రూప్‌లో శ్రేయ అనే మహిళ యాడ్ చేసింది. ఆ గ్రూప్‌లో ట్రేడింగ్‌లో మంచి లాభాలు వస్తాయంటూ తమ కంపెనీ వెబ్‌సైట్ యాప్‌ప్లేయర్.కామ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రూ. 10 వేలు ఇన్వెస్ట్ చేయడంతో 5 శాతం నుంచి 10 శాతం వరకు లాభాలు వచ్చాయి. దీంతో ఆమెను సైబర్‌మోసగాళ్లు మరింతగా పెట్టుబడి పెట్టాలంటూ ప్రోత్సహించారు. యాప్ ప్లేయర్ యాప్‌లో ట్రేడింగ్ చేస్తూ నేరగాళ్లు చెప్పినట్లు వివిధ బ్యాంకు ఖాతాలలో డబ్బు డిపాజిట్ చేస్తూ ఆ స్కీన్ షాట్‌ను నేరగాళ్లు సూచించిన వాట్సాప్ నంబర్‌కు పంపిస్తూ వచ్చింది. అందులో ప్లాటినం, గోల్డ్, డైమాండ్ అంటూ స్కీమ్‌లు ఉండడంతో ఆయా స్కీమ్‌లను సెలక్ట్ చేసుకొని డబ్బు డిపాజిట్ చేస్తూ వెళ్లడంతో ఆటోమెటిక్‌గా స్క్రీన్‌పై తాను డిపాజిట్ చేసిన డబ్బు వివరాలు కన్పిస్తూ వచ్చాయి. దానికి 10 శాతం లాభాలు రోజు కన్పిస్తుండడంతో బాధితురాలు నిజమని నమ్ముతూ రూ. 21 లక్షల వరకు పెట్టుబడి పెట్టింది. డబ్బు డ్రా చేసుకోవడానికి ప్రయత్నించడంతో ఒకే సారి రూ. 10 లక్షలు మాత్రమే ఉన్నాయంటూ కన్పించింది. సైబర్‌నేరగాళ్లు ఇచ్చిన నెంబర్‌కు ఫోన్ చేసి అడగడంతో 'మీ అకౌంట్ నెగెటివ్‌లోకి వెళ్లింది. ఎక్కువ మొత్తం పెట్టుబడి పెడితే ఈజీగా పాజిటివ్‌లోకి వచ్చి మరిన్ని లాభాలు వస్తాయి' అంటూ మరో రూ. 21 లక్షలు డిపాజిట్ చేయండంటూ కోటి రూపాయల వరకు లాభాలు వస్తాయంటూ నమ్మించారు. ఇక్కడ మీరు వేగంగా ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి ట్రేడింగ్ చేయాలని, లేదంటే మార్కెట్ ఒడుదుడుకులతో మీ అకౌంట్ నెగెటివ్‌లోకి వెళ్తుందని నమ్మించారు. మీరు పెట్టిన డబ్బంతా డ్రా చేసుకోవాలంటే రూ. 21 లక్షలు డిపాజిట్ చేసి మీ పాత డబ్బును డ్రా చేసుకోండి, మీ అకౌంట్ యాక్టివ్‌గా ఉంటూ ఎక్కువ లాభాలు వస్తాయంటూ నమ్మించే ప్రయత్నం చేశారు. బాధితురాలు ఇదంతా మోసమని గుర్తించి రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కాపర్ పవర్ కంట్రోల్ కేబుల్ చోరీ

డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేశ్ తదితరులు

- నిందితుల నుంచి రూ.20లక్షల నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం
- సెక్యూరిటీ గార్డే సూత్రధారి.. ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు
- ఏడుగురు సభ్యుల ముఠాలో నలుగురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేశ్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 27: 'కంచ చేను మేసిన' చందంగా.. కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డు కొంతమందితో చేతులు కలిపి పెద్ద ఎత్తున చోరీకి పాల్పడ్డాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు శంషాబాద్ జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ రాజేశ్ గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జీఎంఆర్ ఏరీనాలో బిమార్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి సంబంధించిన కాపర్ పవర్ కేబుల్ స్టోరేజీ ఉన్నది. స్టోరేజీలో ప్రధాన నిందితుడు అయిన బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామంలోని సిగ్నేచర్ వెంచర్ లో నివాసం ఉంటున్న అదిల శ్రీకాంత్ (28) స్టోరేజీ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతను ఉప్పుగూడ శివాజీనగర్ కు చెందిన కేతావత్ భాష(32), ముషీరాబాద్ బోలక్ పూర్ కు చెందిన అబ్దుల్ వాహిద్ (44) , బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఖాదర్ ఖాన్(40) , మహమ్మద్ హుస్సేన్, కుర్షీద్ హుస్సేన్, అలీ అనే ఏడుగురు తో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు. ప్రధాన నిందితుడు శ్రీకాంత్ స్టోరేజ్ కి సంబంధించిన నకిలీ తాళం చెవిని తయారు చేశాడు. ఈ ముఠా సభ్యులతో కలిసి ఎవరికీ అనుమానం రాకుండా తాళం తెరిచి కాపర్ పవర్ కంట్రోల్ కేబుల్ చోరీ చేశారు. అనంతరం దాన్ని ముక్కలుగా చేసి వివిధ ప్రాంతాలలోని పాత ఇనుప సామాగ్రి దుకాణాలలో అమ్మేశారు. అయితే స్టోరేజీలో నవంబర్ 17 నుంచి 27వ తేదీ మధ్య పవర్ కేబుల్ దొంగతనం జరిగిందని ఆ సంస్థ గుర్తించింది. అంతర్గత రహస్య విచారణ చేపట్టిన సంస్థ యాజమాన్యం సెక్యూరిటీ గార్డు శ్రీకాంత్ కొంతమందితో కలిసి దొంగతనం చేసినట్లుగా నిర్ధారణకు వచ్చారు. ఈనెల 11వ తేదీన సంస్థ ప్రతినిధి అయిన పవన్ కుమార్ కద్వాల్ శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీసులకు తమ సంస్థలో దొంగతనం జరిగిందని, దానికి సెక్యూరిటీ గార్డు శ్రీకాంత్ పైనే అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా శ్రీకాంత్ తోపాటు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. అమ్మిన కేబుల్ విలువను వెలకట్టి రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నలుగురు నిందితులు శ్రీకాంత్, కేతావత్ భాష, అబ్దుల్ వహీద్, మహమ్మద్ ఖాదర్ ఖాన్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మిగతా ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసిన రెండు వారాల్లోపే కేసు ఛేదించి రూ .20 లక్షల నగదు, సెల్ ఫోన్లు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు శ్రీకాంత్ గతంలోనూ చోరీకి పాల్పడినట్లుగా గుర్తించారు. కేసు ఛేదించడంలో చురుకైన పాత్ర పోషించిన పోలీసులను ఆయన అభినందించి రివార్డు అందజేశారు.